క్లుప్తంగా

క్రీడలలో ప్రతిభ కనబరచాలి



క్రీడాకారులను అభినందించిన యాజమాన్యం

బాలాజీచెరువు: మహిళలు విద్యతో పాటు క్రీడల్లో మంచి ప్రతిభ చూపాలని ఆధార్ సేవా కేంద్రం మేనేజర్ కె.శ్రీనివాసరవర్మ పేర్కొన్నారు. ఏఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం అండర్-19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం విజేత టి.దుర్గా హేమలత, హ్యాండ్ బాల్ విన్నర్ ఏజే.బాలత్రిపుర సుందరి, వి.మాధవి, పి.యుగశ్రీలను సత్కరించి సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి, ధనలక్ష్మి, సౌజన్య, సంధ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో మధుమేహ పరీక్షలు



వృద్ధులకు మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: వాకలపూడి సంతోష్‌నగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆశ్రయ వృద్ధుల సంక్షేమ ఆశ్రమంలో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఐడీఏ రాష్ట్ర కన్వీనర్ డాక్టరు అడ్డాల సత్యనారాయణ వృద్ధులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు రవి కుమార్, టీవీఎస్ఎన్ రెడ్డి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం గ్రామంలో రైతులకు సమాచార హక్కు చట్టం - 2005పై వ్యవసాయ శాఖ అధికారి చీకట్ల సత్యనారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందో వివరించారు. చట్టం ద్వారా తెలుసుకోవల్సిన వాటి వివరాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్, పశు సంవర్ధకశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'గౌరవం-తల్లిదండ్రులు'పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కాకినాడ సిటీ: జిల్లా సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు 'గౌరవం-తల్లిదండ్రులు' అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వీవీవీఎస్ లక్ష్మణరావు, సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులను పిల్లలు ఏ విధంగా చూసుకోవాలి, సంతోషంగా ఎలా ఉంచుకోవాలి, లేకపోతే చట్టపరంగా ఏ విధమైన చర్యలు ఎదుర్కొనవలసి వస్తుంది అన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వి రామ సుబ్బారావు, ఎస్‌వి ప్రసాద్, హెచ్ఎం టి.అనురాధ, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు వేయరూ



అధ్వానంగా ఉన్న కొండయ్యపాలెం బ్రిడ్జి-ఎల్‌బీ నగర్ రహదారి

బోట్‌క్లబ్: కొండయ్యపాలెం బ్రిడ్జి నిర్మించి వినియోగంలోనికి వచ్చినా అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణికులు నిత్యం నరకయాతన పడుతున్నారు. స్థానిక కొండయ్యపాలెం బ్రిడ్జి నుంచి ఎల్‌బీ నగర్‌కు కలిపే అప్రోచ్ రోడ్డు గత నాలుగు నెలలుగా గోతుల మయంగా మారింది. ప్రస్తుతం వర్షం కురవడంతో బురదమయంగా మారింది. ఇటీవల రోడ్డు నిర్మాణం చేయకుండా దీనిపై గ్రావెల్ వేయడంతో మరింత అధ్వానంగా తయారయ్యింది. వర్షం వస్తే రోడ్డుపై ప్రయాణించే వారు జారి పడిపోతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధికి బాటలివిగో..

- ఆరు దశల్లో ఐటీఐ ప్రవేశాలకు వంద శాతం అడ్మిషన్లు
- ఏడాది, రెండేళ్ల కాల వ్యవధిలో కోర్సులకు పెరిగిన డిమాండ్
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో ఆసక్తి చూపుతున్న యువత



యంత్రాన్ని మరమ్మతు చేయడాన్ని పరిశీలిస్తున్న ఐటీఐ విద్యార్థులు

బాలాజీచెరువు: ఐటీఐ పూర్తిచేసిన వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఈ కోర్సులు ముగించిన వారికి పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరం ప్రవేశాలు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఐటీఐ చివరి సంవత్సరంలోనే జాబ్‌మేళాలో పరిశ్రమల్లో ఉపాధి పొందే వీలుండటంతో ఈ కోర్సులకు డిమాండ్ ఏర్పడింది. పదో తరగతి పూర్తి చేయగానే ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కని బాట చూపుతాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇది చక్కటి అవకాశంగా భావించవచ్చు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ ఐటీఐలో ఉన్న 700 సీట్లకు ఆరు దశలో నూరు శాతం అడ్మిషన్లు కల్పించారు.

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఇది ఒక చక్కని మార్గంగా ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయి. అయితే ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో..

ఐటీఐలో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాల పరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, ఇన్సుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి.

అలాగే ఏడాది కాల పరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏయే ఐటీఐలలో ఉన్నాయో పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తి అయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా జూన్ మొదటి, రెండో వారాల్లో ఉపాధి, శిక్షణ శాఖ నోటిఫికేషన్ ప్రకటిస్తుంది.

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి కూడా ఒక చక్కని అవకాశంగా దోహదపడుతుంది. ఈ విధంగా ఏటా పలువురు విద్యార్థులు నేరుగా లేటరల్ ఎంట్రీని పొంది, ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.

షార్ట్ టెర్మ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



"షార్ట్ టెర్మ్ కోర్సులైన వెబ్ డెవలపర్, అసిసెటంట్ ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్ మెకానిక్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాము. ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే ఆయా కోర్సుల తరగతులు ప్రారంభిస్తాం."

– ఎంవీజే వర్మ, ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల, కాకినాడ

మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మహిళలు లేదా బాలికలపై అత్యాచారాలు జరగడం బాధాకరమన్నారు. ఇంటర్‌నెట్, పబ్బులు, సెల్‌ఫోన్లలో అశ్లీలత దీనికి ప్రధాన కారణమన్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలకు పాల్పడేది అధిక శాతం పరిచయస్తులేనన్నారు. వారితో జాగ్రత్తలు పాటించడంతో పాటు యువత నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందించుకోవల్సి ఉందన్నారు. అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, శ్రీనగేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడి అరెస్టు

- ప్రేమ పేరుతో నమ్మించి వంచన
- ఆత్మహత్యకు పురిగొల్పాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు

కాకినాడ రూరల్: ఏడేళ్ల ప్రేమాయణం సాగించి మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకుని ప్రియురాలి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల మేరకు కాకినాడ గుడారిగుంట గాంధీ బొమ్మ సెంటరుకు చెందిన యువతిని యు.కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెందిన యువకుడు ములికి ఉమామహేశ్వరరావు 2017 నుంచి ప్రేమిస్తున్నాడు. పెళ్లి చూపుల వరకు వచ్చి నిలిచిపోయినా పెళ్లి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించడంతో వారి ప్రేమ కొనసాగింది. ఇంతలో గుడారిగుంటకు చెందిన మరో యువతితో అతడి నిశ్చితార్థం జరిగి వివాహానికి సిద్ధపడడంతో ఉమా మహేశ్వరరావును ఆ యువతి నిలదీసింది. దీంతో తన పెళ్లికి అడ్డురావద్దని అతడు చెప్పాడు. అతని నిర్ణయంతో ఆ యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి పురుగుమందు దుకాణానికి వెళ్లింది. అక్కడ ఆమె పురుగు మందు తీసుకుని డబ్బు పంపమని ఆ దుకాణంలోని క్యూఆర్ కోడ్ పంపగా ఉమా మహేశ్వరరావు దాని ద్వారా రూ.275 చెల్లించాడు. ఇది జరిగిన పది రోజుల అనంతరం 14వ తేదీన ఆమె పురుగుమందు తాగి 15 తేదీన మృతి చెందింది. కాగా పురుగుమందు కొనుగోలుకు డబ్బు పంపి తన కుమార్తె మృతికి ఉమామహేశ్వరరావు ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆ యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. యువతి మృతికి కారణమైన ఉమామహేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఆయన సీఐ తెలిపారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే- గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ కోరారు. మండలం సిరిపురంలో మంగళవారం సర్పంచ్ సున్నసుజాత అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు డాక్యుమెంట్‌లు, పాస్ పుస్తకాలు, 1బి అడంగళ్‌లో ఏమైనా తప్పులుంటే, రీ సర్వే చేసేటప్పుడు దగ్గరుండి సవరించుకోవాలన్నారు. మండల సర్వేయర్ ఎస్.రూపవతి, రీసర్వే డీటీ దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, వీఆర్వో డి.లక్ష్మీప్రసన్న, వీఎస్ వి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు పరామర్శ

కాకినాడ క్రైం: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు పరామర్శించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పోలీస్ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం పోర్టు సీఐ సునీల్ అమరవీరులు గంటిమిల్లి సత్యనారాయణ, కోటపాటి వీర గంగరాజు, దేవరాజు కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత వరలక్ష్మి మాట్లాడుతూ పేదలకు తమ వంతుగా సేవ చేయాలనే భావనతో దుప్పట్ల పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, శ్రీనివాసరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

కరప: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన కూటమి నాయకులతో కలసి పలు గ్రామాల్లో పర్యటించి రూ.40 లక్షలు విలువ చేసే ఐదు అభివృద్ధి పనులకు భూమిపూజ, శిలాఫలకాలు ఆవిష్కరించారు.

పిస్టల్ షూటింగ్‌లో ప్రణవ్ ప్రతిభ



రాష్ట్రస్థాయి పిస్టల్ షూటింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించిన శ్రీసూర్యప్రణవ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజమహేంద్రవరం సంపత్‌నగర్‌లోని రాజమహేంద్రవరం ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో ఈనెల 20న జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల పిస్టల్ షూటింగ్ పోటీలలో కాకినాడకు చెందిన శ్రీసూర్య ప్రణవ్ ప్రతిభ కనపరిచాడు. ఈ పోటీలలో అండర్-17 విభాగంలో ప్రథమ స్థానం పొంది స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. డిసెంబరులో భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పిస్టల్ షూటింగ్ పోటీలకు అర్హత సాధించాడు. గంగరాజు నగర్ ఆదిత్య ఐఐటీ స్కూల్‌లో అతడు చదువుతున్నాడు. అతడిని ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం..!



కొత్తపల్లి-పండూరు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

- ప్రమాదాలకు నిలయంగా రహదారులు
- వానొస్తే గొయ్యేదో.. రోడ్డేదో తెలియని పరిస్థితి
- పయనించాలంటే భీతిల్లుతున్న ప్రజలు



ఉప్పాడ-పొన్నాడ రహదారిలో పరిస్థితి..

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో ప్రధాన రహదారి పరిస్థితి అడుగుకో గుంతలా తయారైంది. దీనికి తోడు భారీ వర్షాలకు గోతుల్లో నీళ్లు చేరి సమతలంగా కనిపిస్తూ గోతులు గుర్తించక వాహన చోదకులు ప్రమాదాలపాలవుతున్నారు.

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో లింకురోడ్లు, తారురోడ్లతో పాటు సమీప మండలాలైన పిఠాపురం, ఉప్పాడ, కాకినాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గోతుల మయం కావడంతో రాకపోకలకు వాహనచోదకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఇలా పిఠాపురం-ఉప్పాడ, కొత్తపల్లి-పండూరు, మూలపేట-నాగులపల్లి, యండపల్లి జంక్షన్-రమణక్కపేట, కొమరగిరి-పిఠాపురం, ఉప్పాడ-పొన్నాడ, ఉప్పాడ-కాకినాడ బీచ్ వెళ్లే రోడ్డు భారీగా గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఆటోలు, ద్విచక్రవానాలపై నిత్యం వెళ్లే ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. బాలింతలు, గర్భిణులు, వైద్యశాలలకు ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నెం.	స్టేషన్ వెళ్ళే ప్రాంతం	వెళ్లే వేళ	వచ్చే వేళ
17258	కాకినాడ పోర్టు -విజయవాడ (మెము)ప్రతిరోజూ	04.20	23.03
17267	కాకినాడ పోర్టు - విశాఖపట్నం (మెము) ప్రతిరోజూ	04.45	21.28
12755	కాకినాడ పోర్టు - భావనగర్ (భావనగర్) గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు - సాయినగర్ (షిర్డి) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు - లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు - పుదుచ్చేరి (సర్కార్) ప్రతిరోజూ ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్ - చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్ - తిరుపతి ప్రతిరోజూ	15.15	11.45
17210	కాకినాడ టౌన్ - బెంగుళూరు (శేషాద్రి) ప్రతిరోజూ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు - లింగంపల్లి (గౌతమి) ప్రతిరోజూ	19.20	06.58
07445	కాకినాడ టౌన్ - లింగంపల్లి (స్పెషల్) సోమ బుధ, శుక్ర	20.10	07.10

సామర్లకోట మీదుగా విజయవాడ వైపు వెళ్లు రైళ్లు

రైలు నెంబరు	ఎక్కడ నుంచి ఎక్కడకు	సర్వీసు	రాక	పోక
20805	విశాఖపట్నం - న్యూఢిల్లీ	ప్రతిరోజు	00-08	00-10
12703	హౌరా - సికింద్రాబాద్	ప్రతి రోజు	00-44	00-45
11020	భువనేశ్వర్-బెంగుళూరు	ప్రతిరోజు	00-54	00-55
17220	విశాఖపట్నం-మచిలీపట్నం	ప్రతిరోజు	01-04	01-05
12552	కామాఖ్య - బెంగుళూరు	శుక్ర	01-08	01-10
22883	పూరి - బెంగుళూరు	శని	01-23	01-25
22707	విశాఖపట్నం-తిరుపతి	మంగళ, శుక్ర, ఆది	01-23	01-25
18519	విశాఖ-లోకమాన్యతిలక్	ప్రతి రోజు	01-43	01-45
22859	పూరి - చెన్నైసెంట్రల్	సోమ	03-13	03-15
22825	షాలిమార్-చెన్నైసెంట్రల్	బుధ	03-44	03-35
17258	కాకినాడ-విజయవాడ	ప్రతి రోజు	04-33	04-35
12755	కాకినాడ-భావనగర్	గురు	05-53	05-55
17481	బిలాస్‌పూర్-తిరుపతి	బుధ,ఆది	05-49	05-50
17479	పూరి - తిరుపతి	బుధ, ఆది	05-49	05-50
22851	సంత్రాగచి-మంగుళూరు	శుక్ర	06-13	06-15
18045	షాలిమార్-హైదరాబాద్	ప్రతి రోజు	06-33	06-35
17206	కాకినాడ-సాయినగర్‌షిర్డి	సోమ, బుధ, శని	06-24	06-25

సంకల్ప్ ట్రెజర్ హంట్ పోస్టర్ ఆవిష్కరణ



ట్రెజర్ హంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రాణాంతక వ్యాధిగ్రస్త చిన్నారులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో లయన్స్‌క్లబ్ సంకల్ప్ ట్రెజర్ హంట్ పేరుతో నిధుల సేకరిస్తోంది. ఇందుకోసం ఈ నెల 27న జరిగే ప్రత్యేక కార్యక్రమానికి సంబంధించి మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ ట్రెజర్ హంట్ పోస్టరును కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని అందజేయడం ద్వారా చిన్నారుల ఆయుర్దాయం, ఆరోగ్యాన్ని పెంచేందుకు అవసరమైన నిధులను సేకరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు లావణ్య, సమయమంత్రి స్వాతి, పెద్ది అనిత, మోనికా, సాగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి సెలవుకు కారణమేంటో!

కాకినాడ రూరల్: కొత్తగా విధుల్లో చేరిన కార్యదర్శి అంతలోనే సెలవుపై వెళ్లడం తిమ్మాపురం పంచాయతీలో చర్చనీయాంసమైంది. ఇటీవలి బదిలీల్లో మాధవపట్నం నుంచి వచ్చిన ఎస్.నాగ ఫణిబాబు పది రోజుల సెలవు పెట్టడంపై సదరు కార్యాలయంలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన చేరిన కొద్ది రోజులకే ఓ జనసేన కార్యకర్త టెంట్ సామగ్రి వినియోగానికి అనుమతి కోరగా చెక్ పవర్ సర్పంచ్ వద్ద ఉంటుందని, తనకు సంబంధం లేదని చెప్పడంతో సదరు కార్యకర్త స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించినట్టు తెలియవచ్చింది. ఈ మేరకు ఆయన కార్యదర్శిని పిలిచి కార్యకర్తకు అనుకూలంగా చేయమని చెప్పినా వినకపోవడంతో సెలవుపై వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేసినట్టు తెలియవచ్చింది. అందువల్లే పది రోజుల సెలవుపై వెళ్లారా లేక మరేదైనా కారణం ఉందా అని సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఈఓ పీఆర్ అండ్ ఆర్డీని వివరణ కోరగా కార్యదర్శి వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారని, సోమవారం సాయంత్రం ఎంపీడీఓను కలిసి లీవ్ లెటరు అందించారని తెలిపారు.

ట్రాక్‌లో స్నేక్ వాక్



వాకింగ్ ట్రాక్‌లోకి వచ్చిన పాము

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): జిల్లా క్రీడా మైదానంలో వాకర్లతో పాటు పాములు సైతం ట్రాక్‌లో నడుస్తూ సాధన చేస్తున్నాయి. వాటి సాధన చూసిన వాకర్లు ఆందోళనతో వాకింగ్ వదిలి రన్నింగ్ చేస్తున్నారు.

నిజమండీ బాబూ.. మంగళవారం డీఎస్ఏ వాకింగ్ ట్రాక్‌లో నడుస్తున్న వాకర్లకు పాము తారస పడడంతో ఒకింత ఆందోళనతో దూరంగా వెళ్లిపోయారు. ఏదైనా జరగరానిది జరిగి ఎవరికైనా కాటువేస్తే జవాబుదారీ ఎవరని వాకర్లు ప్రశ్నిస్తున్నారు. అధికారులు డీఎస్ఏలో తుప్పలు కొట్టించి పాముల బెడద నుంచి కాపాడలని పలువురు వాకర్లు కోరుతున్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్:	విశ్వం, వేట్టయన్, ఇద్దరు, జనక అయితే గనక
దేవి మల్టీప్లెక్స్:	ది డెవిల్, విశ్వం, దేవర, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మీ:	కల్లు కాంపౌండ్
సత్యగౌరి:	లవ్ రెడ్డి
తిరుమల:	ఖడ్గం
సీఅండ్‌సీ:	జనక అయితే గనక
సీఅండ్‌సీ 2:	శ్వాగ్
పద్మప్రియ:	దేవర
శ్రీప్రియ:	మార్టిన్
సూర్య 1:	దేవర
సూర్య 2:	జనక అయితే గనక